


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 75 | శుక్రవారం 14 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# మైనారిటీ రిజర్వేషన్లకు మోదీ, అమిత్ షా వ్యతిరేకం

ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు.



2

# అమరావతి రైతులది త్యాగం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అన్న చంద్రబాబు



2

- శూన్యం నుంచి గొప్ప రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని వ్యాఖ్య
- గ్రాఫిక్స్ అన్నవాళ్లు ఇక్కడకు వచ్చి చూడాలన్న చంద్రబాబు

# భారత్‌తో సరిహద్దు వివాదం..

## ఒరిజినల్ పత్రాల పై చేతులెత్తేసిన నేపాల్

- సుగౌలీ ఒప్పందం అసలు పత్రాలు తమ వద్ద లేవని తెలిపిన నేపాల్
- భారత్‌తో సరిహద్దు వివాదానికి ఈ ఒప్పందమే కీలకం
- పార్లమెంటులో విషయాన్ని అంగీకరించిన నేపాల్ విదేశాంగ మంత్రి
- ప్రభుత్వ విభాగాల్లో వెతికినా అసలు పత్రాలు దొరకలేదని వెల్లడి



2

# క్యాటరింగ్ ట్రక్కులో ట్రంప్!

ఇరాన్ దాడి చేస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో తన అధికారిక విమానం 'ఎయిర్‌ఫోర్స్ వన్'లో కాకుండా మరో విమానంలో రహస్యంగా ప్రయాణించిన విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించారు. 'సీక్రెట్ సర్వీసు, మిలిటరీ సూచనల మేరకు నేను నడుచుకుంటా. వేరే విమానంలో వెళ్లాలని వాళ్లు చెప్పినప్పుడు నేను పాటించాల్సిందే.



2

# చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి



2

- చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు కొత్త స్టీల్ బ్రిడ్జ్
- సంగం లక్ష్మీబాయి సేవలు చరిత్రలో మరువరానివన్న వీహెచ్
- మూడుసార్లు ఎంపీగా గెలిచిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని కితాబు

# ఏపీపీఎస్సీలో అక్రమాలు సిట్ నివేదికతో బట్టబయలయ్యాయి..

## జగన్ సమాధానం చెప్పాలి: మంత్రి డోలా

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, పాపాలు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నివేదిక ద్వారా బట్టబయలయ్యాయని, వీటికి మాజీ ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి డిమాండ్ చేశారు. గురువారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిట్ నివేదికలో వెలుగు చూసిన వాస్తవాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని అన్నారు.



2

# యూనిటీ మాల్ ఒప్పందం పై విచారణ జరగాలి: ఎంపీ రఘునందన్ రావు..



2

తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## భారత్‌తో సరిహద్దు వివాదం.. ఒరిజినల్ పత్రాల పై చేతులెత్తేసిన నేపాల్

భారత్‌తో దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదం నేపథ్యంలో నేపాల్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఇరు దేశాల మధ్య సరిహద్దులను ఖరారు చేసిన 1816 నాటి చారిత్రక సుగౌలీ ఒప్పందానికి సంబంధించిన అసలు పత్రాలు తమ వద్ద ఉన్నాయో లేదో స్పష్టంగా తెలియదని నేపాల్ ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించింది. లిపులేఖ్, కాలాపానీ, లింపియాధురా ప్రాంతాల పై భారత్‌తో వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. నేపాల్ విదేశాంగ మంత్రి షిశిర్ ఖనాల్ ఈ విషయాన్ని ప్రతినిధుల సభలో స్వయంగా వెల్లడించారు. కొన్ని ఒప్పందాలకు సంబంధించిన రికార్డులు నేషనల్ ఆర్కైవ్స్‌లో ఉన్నప్పటికీ, అవి అసలైన ఒప్పంద పత్రాలా కాదా అనే విషయంపై స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. సుగౌలీ ఒప్పందంతో పాటు, 1950 నాటి శాంతి, స్నేహ ఒప్పంద పత్రాలు కూడా తమ వద్ద ఉన్నట్టు కొన్ని రికార్డుల ద్వారా తెలుస్తోందని.. అయితే, పార్లమెంటరీ కమిటీ ఆర్కైవ్స్, మ్యూజియంలు, వివిధ మంత్రిత్వ శాఖలలో శోధించినప్పటికీ, ఈ రెండు కీలక ఒప్పందాల అసలు ప్రతులు లభ్యం కాలేదని వివరించారు. 1814-16 మధ్య జరిగిన ఆంగ్లో-నేపాల్ యుద్ధం అనంతరం సుగౌలీ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, కాళీ (మహాకాళి) నదిని నేపాల్ పశ్చిమ సరిహద్దుగా నిర్ణయించారు. అయితే, ఆ నది లింపియాధురా వద్ద ఉద్భవిస్తుందని, కాబట్టి కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతాలు తమవేనని నేపాల్ వాదిస్తోంది. దీనికి భిన్నంగా, లిపులేఖ్ సమీపంలోని నీటి బుగ్గల నుంచి నది ప్రారంభమవు తుందని, చారిత్రక పరిపాలనా రికార్డుల ప్రకారం ఈ ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ స్పష్టం చేస్తోంది. 2020లో ఈ మూడు ప్రాంతాలను కలుపుతూ నేపాల్ తన నూతన రాజకీయ పటాన్ని విడుదల చేయగా, భారత్ దానిని తీవ్రంగా తోసిపుచ్చింది. ఇటీవల లిపులేఖ్ మీదుగా వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు భారత్, చైనాలు అంగీకరించడం పై నేపాల్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ అంశం మళ్లీ తెర పైకి వచ్చింది.

## క్యాటరింగ్ ట్రక్కులో ట్రంప్!

వేరే విమానంలో వెళ్లాలని వాళ్లు చెప్పినప్పుడు నేను పాటించాల్సిందే. అందుకే మరో విమానంలో ప్రయాణించా'నని వెల్లడించారు. గత నెల తుర్కియే రాజధాని అంకారాలో జరిగిన నాటో సదస్సు నుంచి ట్రంప్ తిరిగి అమెరికాకు వెళ్తున్న సందర్భంగా ఈ పరిణామం చోటు చేసుకుంది. దీని గురించి 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక వెల్లడించటంతో ప్రపంచానికి తెలిసింది. ఇది నిజమేనని ట్రంప్ తాజాగా ధ్రువీకరించారు. అయితే, ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ఉన్న ప్రెసిడెంట్ సిబ్బందికి, జర్నలిస్టులకు ట్రంప్.. వేరే విమానంలో వస్తున్న విషయం తెలియదు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లోకి అందరి ముందే ట్రంప్ రావటంతో, తమతోపాటే ఆయన కూడా ప్రయాణిస్తున్నారనే వారు భావించారు. అయితే, ఈ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం అంకారా నుంచి బ్రిటన్‌లోని ఆర్ఏఎఫ్ మిల్డెన్‌హాల్ వైమానిక స్థావరానికి చేరుకున్న తర్వాత ట్రంప్.. మళ్లీ రహస్యంగా దాంట్లోకి ప్రవేశించారు. దాంట్లోంచి అందరితోపాటు దిగారు. దీనిపై తాజాగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ దాడి చేస్తుందన్న హెచ్చరికలతో ట్రంప్ విమానం మారి తన ప్రాణాలు రక్షించుకున్నారుగానీ.. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ప్రయాణించిన ఇతరుల పరిస్థితి ఏమిటి అంటూ అమెరికా జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. కాగా, అంకారా నుంచి తిరుగు ప్రయాణంలో ట్రంప్ ప్రయాణించే విమానాన్ని ఇరాన్ క్షిపణితో పేల్చే ప్రమాదం ఉందన్న సమాచారం నేపథ్యంలోనే ప్రెసిడెంట్ భద్రతా సిబ్బంది చివరి నిమిషంలో ట్రంప్‌ను మరో విమానంలోకి తరలించారని అమెరికా అధికారులు తెలిపారు. అంకారాలో నాటో సదస్సు జరిగిన ప్రాంగణం వద్ద ఓ వ్యక్తి భుజం మీది నుంచి పేల్చే క్షిపణితో కనిపించాడని అమెరికా నిఘా వర్గాలను ఉటంకిస్తూ 'న్యూయార్క్ టైమ్స్' ఓ వార్తను ప్రచురించింది. నాటో సదస్సులో పాల్గొనేందుకు ట్రంప్ గత నెల 7వ తేదీన అంకారాకు వచ్చారు. మరుసటి రోజు తిరిగి అమెరికాకు వెళ్తున్నప్పుడు అంకారా ఎయిర్‌పోర్టులో మీడియా సమక్షంలో 'ఎయిర్‌ఫోర్స్ వన్'లోకి ట్రంప్ వెళ్లారు. కొంతసేపటికే, విమానం పక్కన నిలిపి ఉంచిన ఓ క్యాటరింగ్ ట్రక్కులోకి ట్రంప్ మారారని, అదే ఎయిర్‌పోర్టులో మరోవైపున ఉన్న సైనిక విమానం సీ-32ఏ వద్దకు ఆ ట్రక్కులో వెళ్లి ఆ విమానం ఎక్కారని వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది.

## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

హైదరాబాద్ నగర పరిధిలోని చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు నూతనంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జ్‌కు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, విద్యావేత్త సంగం లక్ష్మీబాయి పేరుతో నామకరణం చేయాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో, ఆ తర్వాత సమాజ సేవలో సంగం లక్ష్మీబాయి అందించిన నిరుపమాన సేవలు చరిత్రలో మరపురానివని వీహెచ్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ నేలకు చెందిన వీరనారిగా, నిజాం నిరంకుశత్వానికి, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే కాకుండా, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా అల్వాల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఉప విద్యామంత్రిగా సేవలు అందించారని, మెదక్ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని వివరించారు. సైదాబాద్‌లో 'ఇందిరా సేవా సదన్' నెలకొల్పి వేలాది మంది పేద బాలికలకు ఆశ్రయం, విద్య అందించిన మహోన్నత వ్యక్తి ఆమె అని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే విద్యాశాఖ ఉన్నందున, గతంలో విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన సంగం లక్ష్మీబాయి పేరును చంచల్‌గూడ - సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జ్‌కు నామకరణం చేస్తే ప్రజామోదం లభించడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వీహెచ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజ్ఞప్తి పై తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీఎంను కోరారు.

# మైనారిటీ రిజర్వేషన్లకు మోదీ, అమిత్ షా వ్యతిరేకం

రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్ లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. SIR పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## అమరావతి రైతులది త్యాగం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అన్న చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశతో పాటు, విజయవాడ-మంగళగిరి హైవేను అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన నూతన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. ఉండవల్లి వద్ద ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం, అనంతరం స్వయంగా కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జి నిర్మాణాలు, రహదారి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులు, స్థానికులను ఉద్దేశించి ఆయన అత్యంత భావోద్వేగంగా ప్రసంగించారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన అన్నదాతలు చేసింది కేవలం భూత్యాగం మాత్రమే కాదని, రాబోయే తరాలకు, ప్రపంచానికే ఆలోచింపజేసే ఒక గొప్ప స్ఫూర్తినిచ్చారని సీఎం చంద్రబాబు కొనియాడారు. రాజధాని నిర్మాణంలో రైతులను నేరుగా భాగస్వాములను చేయాలనే మహోన్నత ఆలోచనతోనే తాము ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చామని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఉంచిన నమ్మకంతో నోటిఫికేషన్ ఇచ్చిన కేవలం 58 రోజుల్లోనే 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ఉదారత చూడలేమని చెబుతూ అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను స్మరించుకుంటూ, నాడు మనకు రాజధాని ఎక్కడ నిర్మించాలో, ఎటు వెళ్లాలో తెలియని గందరగోళం నెలకొందని తెలిపారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికలు, మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేశామని చెప్పారు. నాడు ఏమీ లేని శూన్యం నుంచి నేడు ప్రపంచం గర్వించే రీతిలో స్వయంగా రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని ప్రస్తావిస్తూ... నాడు ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మిస్తుంటే చాలామంది హేళనగా మాట్లాడి ఎగతాళి చేశారని సీఎం గుర్తుచేశారు. కానీ నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందంటే ఒక నాయకుడిగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. నాడు చేసిన అభివృద్ధి వల్ల అక్కడ 42 శాతం మంది ప్రజలు బాగుపడ్డారని, మిగిలిన 58 శాతం ఉన్న మన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా ఒక సమర్థవంతమైన, ప్రపంచస్థాయి రాజధాని కావాలనే దృఢ సంకల్పంతోనే అమరావతికి శ్రీకారం చుట్టానని స్పష్టం చేశారు. సైబరాబాద్ నిర్మాణం కోసం తాను అమెరికా వెళ్తే, అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరం కావాలని తొలిసారి సింగపూర్ వెళ్లానని చెప్పారు. ఈ నగరంలో కేబుళ్లు ఏవీ పైన కనిపించవని, పూర్తి పర్యావరణహితంగా ప్రపంచంలోనే నంబర్ వన్ గ్రీన్ సిటీగా అమరావతి నిలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అమరావతిని కేవలం 'గ్రాఫిక్స్' అని విమర్శించిన వారు ఇప్పుడు ప్రత్యక్షంగా వచ్చి చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి ఏంటో కళ్లకు కట్టినట్లు తెలుస్తుందని సూచించారు.

## ఏపీపీఎస్సీలో అక్రమాలు సిట్ నివేదికతో బట్టబయలయ్యాయి.. జగన్ సమాధానం చెప్పాలి: మంత్రి డోలా

సిట్ నివేదికలో వెలుగు చూసిన వాస్తవాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని అన్నారు. సిట్ నివేదిక ప్రకారం, వాల్యుయేషన్ ప్రక్రియలో పాల్గొన్న 158 మంది వాల్యుయేటర్లలో కేవలం 72 మందికి మాత్రమే అర్హత ఉందని, మిగిలిన వారంతా అనర్హులేనని మంత్రి స్పష్టం చేశారు. అధికారిక వ్యవస్థను కాదని, ప్రైవేట్ జీమెయిల్ ఖాతాలు, వ్యక్తిగత ఐడీలు, డ్రైవ్‌ల ద్వారా వాల్యుయేషన్ నిర్వహించడం దారుణమని అన్నారు. అంతేకాకుండా, అభ్యర్థుల ఆన్సర్ షీట్లను ఓ ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించి, సీసీ కెమెరాలు గానీ, యూనివర్సిటీ నిపుణుల పర్యవేక్షణ గానీ లేకుండా 86 రోజుల పాటు అక్కడే ఉంచి మూల్యాంకనం జరిపారని ఆరోపించారు. ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 160 మంది (96.97 శాతం) ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయని, మొత్తం 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తే 97.55 శాతం షీట్లలో దిద్దుబాట్లు కనిపించాయని సిట్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో వైట్నర్ వాడకం, సంతకాలు సరిపోకపోవడం, ఒకే పేపర్‌లో రెండు రకాల ఇంక్ వాడటం, చీఫ్ ఎగ్జామినర్ సంతకాలలో తేడాలు వంటి అనేక అక్రమాలు తేలాయని వివరించారు. ఇవి కేవలం సాంకేతిక తప్పిదాలు కావని, మెరిట్ ఉన్న అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకున్న చెలగాటమని మంత్రి మండిపడ్డారు. ఈ అక్రమాలన్నింటికీ జగనే ప్రధాన బాధ్యుడని, యువతను, కోర్టులను తప్పుదారి పట్టించిన ఆయనకు రాజకీయాల్లో కొనసాగే నైతిక అర్హత లేదని డోలా అన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీలో భాగంగా, అత్యంత పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన 16 వేల డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. వైసీపీ నేతలు 240కి పైగా కేసులు వేసినా, చట్టబద్ధంగా అన్నింటినీ అధిగమించి డీఎస్సీని పూర్తి చేశామన్నారు.

## యూనిటీ మాల్ ఒప్పందం పై విచారణ జరగాలి: ఎంపీ రఘునందన్ రావు

ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాల పై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు.

# హైడ్రా కమిషనర్ పై హైకోర్టు ఆగ్రహం..

కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్తులను కూల్చివేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ పై ధిక్కరణ చర్యలను సుమోటోగా స్వీకరించింది. ఆయనకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తూ, రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి మండలంలోని వాణి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పరిధిలో (సర్వే నెం. 194/1, 211) కోర్టు స్టే ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టారన్న ఆరోపణలపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి, తిరుమలగిరి తహసీల్దార్లు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ శాఖ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, తమ అనుమతి లేకుండానే మేడ్చల్ జిల్లాలో హైడ్రా దాదాపు 40 కూల్చివేతలు చేపట్టిందని కలెక్టర్ న్యాయస్థానానికి నివేదించారు. దీని పై హైడ్రా తరఫు న్యాయవాది స్పందిస్తూ, రెవెన్యూ శాఖ సూచనల మేరకే జీఎల్ఆర్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అయితే, సరైన రికార్డులను పరిశీలించకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడం ఆమోద యోగ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. హైడ్రా పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ వద్ద ఉన్న కోర్టు స్టే ఉత్తర్వుల వివరాలను తక్షణమే హైడ్రాకు తెలియజేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ విషయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించింది. హైడ్రా ఏర్పాటుకు ముందు జారీ అయిన స్టే ఉత్తర్వులను సైతం ఆ సంస్థ పరిగణనలోకి తీసుకోవడం లేదని పలు ఫిర్యాదులు వస్తున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది.

# సంపాదకీయం

## విద్యలో డిజిటల్ అంతరాన్ని తగ్గించాలి



డిజిటల్ ఇండియా కార్యక్రమం 2026 జూలై 1 నాటికి విజయవంతంగా పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ కాలంలో దేశవ్యాప్తంగా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) గణనీయంగా విస్తరించింది. గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ సేవల విస్తరణ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఈ--పాలన, దేశీయ ఎలక్ట్రానిక్ తయారీ వంటి రంగాల్లో విశేష పురోగతి సాధించింది. ఈ విజయాలు ప్రశంసనీయమైనవే. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలోనూ, కోట్లాది మంది పౌరులను డిజిటల్ వ్యవస్థలో భాగస్వాములను చేయడంలోనూ ఇవి కీలక పాత్ర పోషించాయి. తెలుగు రాష్ట్రాలు కూడా డీపీఐని వినియోగించుకోవడంలో గణనీయమైన పురోగతిని సాధించాయి. డిజిటల్ పాలన, ఆర్థిక సమ్మిళితత, ఇంటర్నెట్ అనుసంధానాన్ని విస్తరిం చడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ముందడుగు వేశాయి. అయినా, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఈ రెండు రాష్ట్రాల్లోనూ డిజిటల్ వ్యవస్థ ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉంది. తెలంగాణలో డిజిటల్ అభివృద్ధి ఎక్కువగా నగరాలకే పరిమితమవగా, ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్నెట్ వినియోగం పెరిగినా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్యా ఫలితాల్లో అసమానతలు కొనసాగుతున్నాయి. ఇంకా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో తగిన కంప్యూటర్ ల్యాబ్‌లు, విశ్వసనీయ మైన ఇంటర్నెట్ సౌకర్యం, ఆధునిక డిజిటల్ అభ్యాస వనరులు అందుబాటులో లేవు. ఈ పరిస్థితిని వెంటనే సరిదిద్దకపోతే గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల్లో మరింత వెనుకబడే ప్రమాదం ఉంది. అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ వినియోగించి విద్యార్థులకు డిజిటల్ సౌకర్యాలు కల్పించేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. ప్రజా గ్రంథాలయాలు, డిజిటల్ అభ్యాస కేంద్రాలు,కమ్యూనిటీ కంప్యూటర్ కేంద్రాలు విస్తృత స్థాయిలో ఏర్పాటు చేస్తే మరింత మంది విద్యార్థులకు సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాల యాలు, సేవా సంస్థల భాగస్వామ్యంతో వెనుకబడిన ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయవచ్చు.అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలకు అధిక వేగం గల ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాలి. అలాగే డిజిటల్ తరగతి గదులు,స్మార్ట్ బోర్డులు, ఆన్‌లైన్ అభ్యాస వేదికలను ప్రోత్సహించాలి. ఈ పరికరాలు ఏడాది పొడవునా వినియోగంలో ఉండేలా వాటి నిర్వహణకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి.విద్యా సంస్థలు ప్రాంతీయ భాషల్లో డిజిటల్ పాఠాలు, వీడియోలు, వర్చువల్ ల్యాబ్‌లు, పరస్పర క్రియాశీల అభ్యాస మాడ్యూళ్లను అభివృద్ధి చేయాలి. స్థానిక అవసరాలకు అనుగుణమైన డిజిటల్ విద్యా కంటెంట్ లేకపోవడం కూడా సాంకేతికతను బోధన--అభ్యాసన ప్రక్రియలో సమర్థవంతంగా వినియోగించడంలో ప్రధాన అవరోధంగా ఉంది. ప్రస్తుతం చాలా తక్కువ మంది ఉపాధ్యాయులే డిజిటల్ సాంకేతికతను అర్థవంతంగా తరగతి గదుల్లో వినియోగిస్తున్నారు. వీరిలో కూడా చాలామంది తగిన శిక్షణ, అనుభవం లేకపోవడం వల్ల దానిని బోధనలో సమర్థవంతంగా అనుసంధానించలేక పోతున్నారు. అందువల్ల ఉపాధ్యా యులకు నిరంతర వృత్తిపరమైన డిజిటల్ శిక్షణా కార్యక్రమా లను నిర్వహించి, నైపుణ్యాలను అందించాలి.డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, ప్రైవేటు రంగం,పౌర సమాజం సమష్టిగా, దీర్ఘకాలిక దృష్టితో కృషి చేయాలి.

# మహిళా బిల్లు చుట్టూ కాంగ్రెస్ రాజకీయం

పార్లమెంట్‌లో 'మహిళా ప్రాతినిధ్యం, నియోజక వర్గాల డీలిమిటేషన్' చుట్టూ జరుగుతున్న వివాదాన్ని తీవ్రమైన రాజకీయ యుద్ధంగా మార్చింది కాంగ్రెస్. పైకి మహిళల హక్కుల గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ చరిత్రను పరిశీలిస్తే, మహిళా బిల్లు విషయంలో ఆ పార్టీ ప్రదర్శించిన ద్వంద్వ వైఖరి, తాత్సారం, రాజకీయ స్వార్థం... వంటివి ఎన్నో కనిపిస్తాయి. ఇప్పుడు మహిళా బిల్లుకు డీలిమి టేషన్‌ను కారణంగా చూపిస్తున్న కాంగ్రెస్, 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు యూపీఏ అధికారంలో మిత్రపక్షాల ఒత్తిడిని సాకుగా చూపిస్తూ బిల్లును లోక్‌సభలో ఆమోదించకుండా కాలయాపన చేసింది. 2010లో రాజ్యసభలో పాసైన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టకుండా తొక్కిపెట్టింది.మహిళా బిల్లును కాంగ్రెస్ రాజకీయం చేయడం 1996లో దేవెగౌడ మొదటిసారి బిల్లు పెట్టినప్పటి నుంచి జరుగుతూనే ఉంది. యూపీఏ హయాంలో తమ మిత్రపక్షాలైన సమాజ్‌వాది, ఆర్జేడీలు సభలో బిల్లును వ్యతిరేకిస్తూ ఓబీసీ, మైనారిటీ కోటా ఉండాలని బిల్లు ప్రతులను చించేస్తే అధికార భాగస్వామి కాంగ్రెస్, ఆ నిరసనలకు నిశ్శబ్ద ప్రేక్షక పాత్రకే పరిమితమైంది. ఇప్పుడు ముప్పై సంవత్సరాల తర్వాత కూడా మహిళా బిల్లు మీద స్పష్టమైన రాజకీయ వైఖరి తీసుకోకుండా, ఏదో ఒక నెపంతో మహిళా హక్కులను వాయిదా వేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాజ్యాంగ 131వ సవరణ బిల్లు--2026 ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 850కి పెంచాలని ప్రతిపాదన; ప్రస్తుతం కేవలం 14శాతం ప్రాతినిధ్యంతో ఉన్న మహిళలు 128వ రాజ్యాంగ సవరణ బిల్లు--2023, మహిళా రిజర్వేషన్ల బిల్లుతో 33శాతం స్థానాలతో సుమారు 280 పైగా స్థానాలకు పెంచే ప్రతిపాదన గత ఏప్రిల్ 17న లోక్‌సభ ఓటింగ్‌లో 2/3 వంతుల మెజారిటీ లభించక 'ఇండియా' కూటమి వ్యతిరేక ఓటుతో వీగిపోయింది. దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గకుండా, ఏ రాష్ట్రానికీ సీట్లు తగ్గకుండా, మొత్తం సీట్ల సంఖ్యను మాత్రమే పెంచుతూ, 1971 జనాభా నిష్పత్తి ఆధారంగా దక్షిణాది స్థానాల శాతాన్ని యథాతథంగా కాపాడుతూ సీట్లు పెంచే ప్రత్యామ్నాయ ఫార్ములాపై కాంగ్రెస్, విపక్షాలు వారి అభ్యంతరమేమిటో ఇప్పటికీ చెప్పలేదు. ఒకవైపు రాహుల్‌గాంధీ జనాభా ప్రాతిపదికన హక్కులు (జిత్నీ ఆబాదీ, ఉత్నీ హక్) అంటూ నినాదం ఇస్తారు. మరొకవైపు జనాభా ప్రాతిపదికన జరిగే డీలిమిటేషన్‌ను అడ్డుకుంటారు! 2023 సెప్టెంబర్‌లో మోదీ ప్రభుత్వం తెచ్చిన మహిళా బిల్లు 'నారీ శక్తి వందన్ అధినియం' 106వ రాజ్యాంగ సవరణ చట్టం ఆమోదం పొందింది. అయితే, రాజ్యాంగంలో కొత్తగా చేర్చిన ఆర్టికల్ 334ఏ స్పష్టమైన నిబంధన విధిస్తోంది. అది కొత్త జనాభా గణన, దాని ఆధారంగా జరిగే నియోజకవర్గాల సరిహద్దుల పునర్విభజన, డీలిమి టేషన్ పూర్తయిన తర్వాతే ఈ 33శాతం రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. లోక్‌సభ-- ఆర్టికల్ 330ఏ; రాష్ట్ర అసెంబ్లీలతో ఆర్టికల్ 332ఏ తో పాటు ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉప రిజర్వేషన్లు కల్పిస్తూ, 15 ఏళ్ల పరిమితితో సన్‌సెట్ క్లాజ్, స్థానాల రొటేషన్ పద్ధతిని స్పష్టంగా చట్టంలో పొందుపరిచారు. ఈ రాజ్యాం గబద్ధమైన డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తికాకుండా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయమనడం కాంగ్రెస్ చట్టపరమైన నైతికత లేని రాజకీయ విన్యాసమే.



డీలిమిటేషన్ తర్వాతే, ఆమోదించిన మహిళా బిల్లు అమల్లోకి వస్తుంది. ఒకప్పుడు మహిళా బిల్లును ఆమోదించిన కాంగ్రెస్ పార్టీ, మరి ఈ రోజు, డీలిమిటేషన్ లేకుండా మహిళా బిల్లును ఆమోదించాలని ఎలా అడుగుతోంది? ఒకవేళ 2026 జనాభా లెక్కల ప్రకారం జనగణన చేస్తే దక్షిణాదికి లోక్‌సభ సీట్లలో తీవ్ర అన్యాయం జరుగుతుందనే కదా ఇప్పుడు సమస్య. ఆ సమస్యను అసలు పట్టించుకోకుండా, కాంగ్రెస్ సారథ్యంలో కొన్ని ప్రతిపక్షాలు ఏకమై బిల్లును ఓడగొట్టాయి. పైగా కొత్తగా కాంగ్రెస్ ఇప్పుడు డిమాండ్ చేస్తున్న ఓబీసీ కోటాను 2010లో యూపీఏ ప్రవేశపెట్టిన బిల్లులో తామే చేర్చలేదు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు లేని ఓబీసీ కోటా డిమాండ్‌ను కాంగ్రెస్ ఇప్పుడు తెరపైకి ఎలా తెస్తున్నది?

అసలు డీలిమిటేషన్ లేకుండా మహిళా బిల్లు సాధ్యమేనా అంటే, చట్ట ప్రకారం చెల్లదు. ఈ రెండింటినీ వేరు చేయాలని రాహుల్‌గాంధీ, ప్రతి పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ ప్రాథమిక రాజ్యాంగ, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా అర్థమయ్యే విషయం ఏమిటంటే, నియోజకవర్గాల సరిహద్దులు మార్చకుండా ఏ సీటు మహిళలకు, ఏ రాష్ట్రంలో ఎంత కేటాయించాలో నిర్ణయించడం అసాధ్యం. డీలిమిటేషన్ లేకుండా 33శాతం కేటాయించాలంటే, ప్రస్తుతం ఉన్న 543 స్థానాల్లో నుంచే 181 స్థానాలను లాటరీ పద్ధతిలో మహిళలకు ఇవ్వాలి. దీనివల్ల రాష్ట్రాల నియోజకవర్గాల సరిహద్దుల్లో, మహిళా ప్రాతినిధ్యంలో, భారీ అసమానతలు వస్తాయి. అసలు కొత్త సీట్లు 850 వరకు విస్తరించకుండా, పాత స్థానాల్లోనే ఇస్తే సిట్టింగ్ ఎంపీల స్థానాలు ఊడిపోయి, తీవ్ర గందరగోళం ఏర్పడుతుంది. ఈ ఆచరణాత్మక సమస్యను కాంగ్రెస్ గమనించడం లేదు.

1976లో ఎమర్జెన్సీ సమయంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పునర్విభజనపై ఇందిరాగాంధీ 2001 వరకు నిషేధం విధించారు. 2001లో వాజపేయి ప్రభుత్వం దీనిని 2026 వరకు పొడిగించింది. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో తమ సీట్లను కోల్పోకుండా ఉంచాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నుంచి ప్రముఖ రాజకీయ పార్టీలన్నీ డిమాండ్ చేయడంతో ఆ నిర్ణయం తీసుకున్నారు.

కాంగ్రెస్, డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న సభ్య పార్టీలు ఈ విషయాలను స్పష్టం చేయాలి. ఒకటి-- 2026 ప్రకారం జనగణన చేసి, ఆ ప్రకారం పార్లమెంటు సీట్లు ఇస్తే, దక్షిణాదికి సీట్లు తగ్గినా మీకు సమ్మతమేనా?; రెండు-- ఎన్డీఏ చెబుతున్న ప్రకారం 50శాతం పెంచితే మీకు కనిపించే నష్టం ఏమిటి? మూడు-- పోనీ 50శాతం పెంపు లేకుండా దక్షిణాదికి సీట్ల విషయంలో అన్యాయం జరగకుండా మీ దగ్గర ఏదైనా ప్రత్యామ్నాయ ప్రతిపాదన ఉన్నదా? చివరిది-- ఇవేవీ చేయకుండా మహిళా బిల్లును ఎలా పాస్ చేస్తారు?రాహుల్‌గాంధీ సోషల్ మీడియాలో మహిళా సాధికారత ఉపన్యాసాలకు, పార్లమెంట్‌లో కాంగ్రెస్ తీసుకునే నిర్ణయాలకు పొంతన లేదు. మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం దక్కాలంటే కేవలం భావోద్వేగ ట్వీట్లు, నినాదాలు సరిపోవు. దానికి తగిన రాజ్యాంగ ప్రక్రియలను పూర్తి చేయనిచ్చే రాజకీయ నిజాయితీ, సంకల్పం కావాలి.

# జెన్‌జీ: కొత్త తరమా, పాత చట్రమా?

జెన్ జీ' అన్నది ఇప్పుడు నూతన ఉత్సాహాన్ని గుర్తుకు తెచ్చే పదం. ఈ 'జెన్ జీ' తరానికి ఇప్పుడో హీరో వర్షిప్ ఏర్పడింది. ఈ తరం ముందు తరాల్లా కాదనీ; భిన్నమైన ఆలోచనలతో ప్రతిదాన్నీ ప్రశ్నించే తరమనీ అంతా చెప్పుకుంటున్నారు.ప్రతి ఉద్యమం ఏదో ఒక తాత్కాలిక లక్ష్యంతోనే మొదలవుతుంది. కానీ అది వదిలివెళ్లే పాదముద్రలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. మన స్వాతంత్ర్యోద్యమం మొదలుకొని, చైనా సాంస్కృతిక విప్లవం దాకా ఎన్నో ఉద్యమాలు తాత్కాలిక విజయం కోసమే పని చేసినప్పటికీ, తదనంతరం ఆయా సమాజాల్లోని విలువలను ఎలా తలకిందులు చేశాయో చూశాం. ప్రతి ఉద్యమం తెచ్చే మార్పు ఆహ్వానించదగ్గదే. అయితే ఆ ఉద్యమం ప్రకటించిన భావనలు, విధానాలు, తీరుతెన్నులు... ప్రతి ఒక్కటీ సరైనదే అని మాత్రం చెప్పలేం. కార్పొరేట్ పరిభాషలో చెప్పాలంటే-- ప్రొడక్ట్ మంచిదే కావచ్చు, కానీ అది తయారు చేయడానికి వాడిన టెక్నాలజీ కలగజేసిన వాతావరణ కాలుష్యం, దాని పరిణామాలు కొంతకాలం తర్వాతే తెలుస్తాయి. జెన్ జీ అన్నది నేటి యువతరానికి వాడుతున్న పర్యాయపదం. అంటే మానవ చరిత్రలో, పుట్టుకతోనే మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్, డిజిటల్ టెక్నాలజీని చూస్తూ వచ్చిన మొట్టమొదటి తరం. దీని ముందుతరం 'మిలీనియల్స్' (1981--96 మధ్యలో పుట్టినవాళ్లు). 'అనలాగ్', 'డిజిటల్' తరాన్ని ఒకేసారి చూస్తూ దానిని 'అడాప్ట్' చేసుకున్న మొదటి తరం ఈ మిలీనియల్స్. వీళ్లను సాధారణంగా 'అడాప్టబిలిటీ'కి ప్రతీకలుగా చూస్తారు. అంటే ఏ కొత్త మార్పుకైనా సులువుగా మారిపోతారు అని.

ఇంతకు ముందు కూడా యువతరాలు సమాజాన్ని ప్రశ్నించి ఉద్యమాలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. 'నవనిర్మాణ్ ఆందోళన్' అని గుజరాత్‌లో 1974లో హాస్టల్ మెస్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం చివరకు అక్కడి ముఖ్యమంత్రి రాజీనామాకు దారితీసింది. తమాషాగా అదే రాజకీయ నాయకుడు చిమన్‌భాయ్ పటేల్ సొంత పార్టీని స్థాపించి (కిసాన్ మజ్దూర్ లోక్ పక్ష్) 1975 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశారు, ఆపై 1990లో మళ్లీ గుజరాత్ ముఖ్యమంత్రిగా తిరిగి వచ్చారు. అది వేరే సంగతి. తెలంగాణ ఉద్యమాన్ని దగ్గరుండి నడిపింది అప్పటి యువతరమైన విద్యార్థులే. రోహిత్ వేముల మరణాన్ని నిరసిస్తూ నడిచింది అప్పటి తరం విద్యార్థులే. ఇలా చరిత్ర చూస్తే, ప్రతి తరమూ తమ కాలంలో ఏవో ఉద్యమాలు చేసి సంచలనాలు సృష్టించినదే. ఆ యువత తర్వాత ఎదిగి మళ్లీ అవే సామాజిక దురాచారాలను వెంటవేసుకునే తరాల్లో కలిసిపోయింది. ఇది చరిత్ర చెప్పిన నిజం.కాబట్టి ప్రస్తుతం 'జెన్ జీ'కి ఒక అసాధారణమైన హీరో వర్షిప్ కట్టబెట్టే ముందు ఆలోచించాల్సింది ఏమంటే-- ఈ తరం ఏ విలువలను ముందుకు తీసుకెళ్లగలుగుతుంది అన్నది. ఈ జెన్ జీ ఇంటికెళ్లాక మళ్లీ అదే 'ఎండోగమీ'లో పడిపోయి ఎవరి కులాల పిల్లలను వాళ్లు పెళ్లి చేసుకుని, తర్వాత ఆ కులాల్లోనే పిల్లల్ని కని, కంటిన్యూ చేయడమే జరుగుతుంది. ఇక్కడ సమస్య ఏమిటంటే-- 'జెన్ జీ' అనేది ఒక హోమోజీనస్ గుంపు కాదు. దీనికి ఒక ఐడెంటిటీని ఆపాదించలేం. ఇది నిర్ద్వంద్వంగా 'హెటిరోజీనస్ గ్రూప్' (విభిన్నతల సమూహం).

ఈ ఉద్యమంలో సినిమా పాటలకు డాన్సులు వేస్తూ, చప్పట్లు కొడుతూ నాట్యాలు చేసే యువతను చూసినప్పుడు ఇది సమస్యపై తీవ్రంగా పోరాడే గుంపులా గాక, తమకుండే మూక బలాన్ని ఎంజాయ్ చేసే గుంపులా మాత్రమే కనిపించింది. ఆ వినోదం వాళ్లను ఒకటి చేసింది, వాళ్లంతా కలిసి ఒక సమస్యను ఎదుర్కొన్నారు. అది సంతోషదాయకమైన విషయం. కానీ ప్రతి ఉద్యమమూ ఒక దుఃఖ సన్నివేశం నుంచి పుడుతుంది. ఉద్యమ క్రమంలో ఆ భావావేశాన్ని వెనక్కు నెట్టివేయడం 'జెన్ జీ' ఏ కాదు, అది ఎవరు చేసినా అసంబద్ధమే.

ఒక మూర్ఖత్వాన్ని తృణీకరించాలంటే అందుకు సరైన మాధ్యమం వ్యంగ్యం (సెటైర్ లేదా సర్కాజం). 'జెన్ జీ' విషయంలో ఇది వ్యంగ్యాన్ని దాటి, బూతు రూపం కూడా తీసుకుంది, సందట్లో సడేమియా లాగా దానికి ఒక ఆమోద ముద్ర కూడా పడిపోతున్నది. ఇప్పటికిప్పుడు 'జెన్ జీ' ఉద్యమానికి అనుబంధంగా పుట్టిన విలువలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం లేదు. కానీ ఆ విలువలను విమర్శనాత్మకంగా గమనించాల్సి ఉంది. గాంధీ పక్కన అంబేద్కర్ ఫొటో పెట్టడంతోటే ఈ ఉద్యమంలో ఉన్న తీవ్రమైన రాజీ స్వభావం లీలగా అర్థం అవుతున్నది.



రోహిత్ వేముల మరణం తర్వాత మిలీనియల్స్ వ్యవస్థకు వ్యతిరేకంగా విస్తృత పోరాటం చేశారు. కానీ అది ఒక కులానికి సంబంధించిన పోరాటంగా ఉండిపోవడం వల్ల, ఆ తరానికి హీరోయిజం ఆపాదించబడలేదు. ఇప్పుడు 'జెన్ జీ'కి దొరికిన సింపతీని నాడు అన్యాయానికి నిర్ద్వంద్వంగా ఎదురు తిరిగి, యూనివర్సిటీ హాస్టల్స్ నుంచి వెలివేయబడ్డ మిలీనియల్స్ దక్కించుకోలేకపోయారు.

సెప్టెంబర్ 2025లో ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలను గమనిస్తే, ఆరెస్సెస్ అనుబంధ విద్యార్థి సంస్థ అయిన ఏబీవీపీ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అది అలా గెలిచింది ఈ 'జెన్ జీ' ఓట్లతోనే. ఇదే 'జెన్ జీ' హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్నికల్లో కూడా ఏబీవీపీనే ఎన్నుకుంది. కాబట్టి ఈ 'జెన్ జీ' తరం ఇంతకుముందు తరాలకు భిన్నంగా ఏమీ లేదు, ముఖ్యంగా ఇందులో హెటిరోజినిటీని తగు మోతాదులో కలుపుకునే ఉంది.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి ఇంట్లో అల్పాహార సమావేశం



న్యూ ఢిల్లీలో రాష్ట్ర రాజధాని అమరావతి ఆధునిక అభివృద్ధి పుస్తకాలు ఎంపీలకు అందజేస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ని న్యూ ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ సన్మానం

**నంద్యాల ఆగస్టు 13 వార్త సాక్ష్యం**
న్యూ ఢిల్లీలో కేంద్రభారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నివాసంలో గురువారం కేంద్ర పార్లమె ంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో నిర్వహించిన అల్పాహార సమావేశంలో సహచర పార్ల మెంట్ సభ్యులతో కలిసి పాల్గొన్నానని నంద్యాల పార్లమెంట్ సభ్యు రాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి చె ప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధాని అమ రావతి గురించి కూడా చర్చించే అవకాశం లభించి ందనీ. అమరావతి అభివృద్ధి, ప్రాధాన్యతను వివరించే పుస్తకాలను పార్లమెంట్ సభ్యులకు అందజేయడం జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# సంక్షేమ హాస్టల్ లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

**నందికొట్కూరు ఆగస్టు 13 వార్త సాక్ష్యం**
రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ లో సమస్యలు ఇక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లు సమస్యలు ఉన్నాయని పిడిఎసు జిల్లా నాయకులు డి .శ్యాం నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ అలాగే బీసీ వెల్ఫేర్ హాస్టల్లో సరైన మౌలిక వసతులు లేవని విద్యార్థులకు సరైన భవనాలు లేక పాత భవనాల్లో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి మెస్ చార్జీలు పెంచకపోగా మొన్నటికి మొన్న 10 శాతం మిస్ చార్జీలు పెంచడం ఏంటని ధరలు 4రెట్లు పెరిగాయని పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి సంవత్సరం మెస్ ఛార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంతవరకు సంక్షేమ హాస్టల్స్ కి బెడ్ షీట్ లు ట్రంకు పెట్టెలు విద్యార్థులకు ప్రభుత్వం అందించలేదని వారు అన్నారు హాస్టల్స్ లో ఉడికి ఉడకని అన్నం నీళ్లచారే విద్యార్థులకు శరణం అని వారు అన్నారు రాష్ట్రంలో జైల్లో ఉన్న ఖైదీలకు ఇచ్చే మెస్ చార్జీలు కూడా విద్యార్థులకు ఇవ్వడం లేదని ఇదెక్కడి న్యాయమన్నారు సంక్షేమ హాస్టల్స్ ను తీర్చిదిద్దుతామన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంక్షేమ హాస్టల్లో సమస్యలను గాలికి వదిలేసారని వారు అన్నారు హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలని రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న సంక్షేమ హాస్టల్ వార్డెన్ పోస్టులను వెంటనే విడుదల చేయా లని వారు ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్ ల సమస్యల పరిష్కారా నికై హాస్టల్ సర్వేలు నిర్వహి స్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎసు నాయకులు అంజి, శివా జీ ఆది, యశ్వంత్, రాజు, దీపక్ నాయక్, అజ య్, కుమార్ ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు: జగన్

**ఆగస్టు 13 వార్త సాక్ష్యం**
రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడు తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్సైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపి ంచారు. దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసు లు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వం దల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు. ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపిం చారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరి ంచడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.



# రాజమండ్రి సమీపంలో భారీగా గంజాయి పట్టివేత- ఇద్దరి అరెస్ట్

**ఆగస్టు 13 వార్త సాక్ష్యం**
తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీలేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి విజయవాడకు కారులో అక్రమంగా తరలిస్తున్న 25.970 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక కారును ఆపి సోదా చేయగా, మూడు పాలిథిన్ సంచుల్లో నిల్వ చేసిన గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4.29 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులను ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన దులపల్లి సుజీవ్ కుమార్, మొదుగు నరేష్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి ఒక కారు, రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని విజయవాడకు చెందిన చినంశెట్టి రాజేష్ అనే వ్యక్తికి చేరవేసేందుకు తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సీలేరులో గంజాయిని సరఫరా చేసిన చింటూ అనే వ్యక్తితో పాటు రాజేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



# అంగన్వాడి యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి మృతికి సంతాపం



**ఆత్మకూరు ఆగస్టు 13 వార్త సాక్ష్యం**



ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్ట్ యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఆమె మృతదేహానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు సురేంద్ర, అంగన్వాడి యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, విజయలక్ష్మి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. సుదీర్ఘకాలం దాదాపుగా 30 సంవత్సరాలు అంగన్వాడి కార్యకర్తగా తక్కువ జీతంతో విధులు నిర్వహిస్తూ, అంగన్వాడీల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసి విజయాలు సాధించడం జరిగిందన్నారు. ఆమె మృతి అంగన్వాడి యూనియన్ కి తీరని లోటని వారు పేర్కొన్నారు. ఐసిడిఎస్ అధికారులు వెంకటలక్ష్మి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు.

## చిన్నారులకు క్రమశిక్షణ అంగన్వాడి కేంద్రాలు కీలకం



**కొత్తపల్లి ఆగస్టు 13 వార్త సాక్ష్యం**
గ్రామాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల విద్యకు కీలకమని మండల విద్యాశాఖ అధికారి నాగరాజు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు కుమారి, నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడవరోజు జ్ఞాన జ్యోతి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల విద్యకు కీలకం అన్నారు. ప్రతి అంగన్వాడి టీచర్ వస్తున్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి కథలు, బొమ్మల ద్వారా అక్షరాలు నేర్పించాలి అన్నారు. అనంతరం డిఆర్పీలు, సూపర్వైజర్లు మాట్లాడుతూ ఆర్ ఎల్ ఎం, టిఎల్ఎం తల్లుల సమావేశం ఎలా నిర్వహించాలి అనే అంశాలను వివరించారు. అంగన్వాడి కేంద్రాల్లో ఎలా ఇంప్లిమెంటేషన్ చేయాలి అనే అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది అన్నారు. అంగన్వాడీ కేంద్రానికి వస్తున్న పౌష్టికాహారాన్ని మహిళలకు అందిస్తూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తెలియజేయాలి అన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లితోపాటు పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్పిలు శివశంకర్, అబ్రహం, రామకృష్ణ, రషీద్ హుస్సేన్, అంగన్వాడి టీచర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాంకు సేవలు విస్తృతంగా అందిస్తాం



**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 13 వార్త సాక్ష్య**
ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మణుగూరు , పినపాక జెడ్.పీ.హెచ్.ఎస్ పిల్లలకు అవగాహన కల్పించి, పిల్లలకు అకౌంట్ బుక్ అందించడం జరిగింది, పిల్లలు మరియు తల్లిదండ్రులు బ్యాంకు ల చుట్టూ తిరగకుండా ఆర్థిక అక్షరాస్యత మణుగూరు కేంద్రం వాళ్ళే స్వయంగా స్కూల్ దగ్గరకు వచ్చి అప్లికేషన్ తీసుకొని వెళ్ళి మళ్ళీ వాళ్ళే స్కూల్ కి వచి అకౌంట్ బుక్స్ అందించడం జరిగింది దీనికి గాను స్కూల్ హెచ్.యం రామిరెడ్డి పిల్లలు చాలా సంతోషం గా ఉన్నారు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మణుగూరు సురేష్ కు ధన్యవాదములు తెలియ జేశారు ఈ కారక్రమం లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మణుగూరు నుండి సురేష్ మరియు స్కూల్ హెచ్.యం డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
శుక్రవారం 14 ఆగష్టు 2026

## నిరుపేద కుటుంబానికి సాయం



కర్లపాలెం ఆగస్టు 13 వార్త సాక్ష్యం

కర్లపాలెం మండలం లోని నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ప్రతి గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అంబేద్కర్ సేవా సమైక్య గౌరవ అధ్యక్షులు మందపాటి పరమానంద కుమార్ అన్నారు. కర్లపాలెం మండలం దుండివారిపాలెం పంచాయతీ పరిధిలోని బిడారిదిబ్బ గ్రామంలో ఓ నిరుపేద కుటుంబానికి రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా రెడ్డి సేవా మిత్ర అధ్యక్షులు నంగు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, గ్రామాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు విద్యలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర సెక్రెటరీ ప్రసాద్ రెడ్డి, కోశాధికారి అట్ల హరిబాబురెడ్డి, దొంతురెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా జాతీయ జెండా ఎగరవేయాలి



కర్లపాలెం ఆగస్టు 13 వార్త సాక్ష్యం

ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని కర్లపాలెం తహసీల్దార్ డి. రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. గురువారం బాపట్ల జిల్లా ప్రకృతి పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో కర్లపాలెంలో 100 మీటర్ల భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమానికి మండలి జిల్లా అధ్యక్షులు ఆవల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంతో పాటు పర్యావరణం, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మండల అభివృద్ధి అధికారి జాతీయ పతాకం ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాంధ్ర సాంబశివరావు మాట్లాడుతూ దేశానికి సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.అనంతరం స్థానిక పాల కేంద్రం వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. జాతీయ పతాకం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రకృతి పరిరక్షణ మండలి ప్రతినిధులు ఇనకొల్లు పోలీసురావు, ఉప్పెన నరసింహారావు, ప్రసాదరావు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు వేణు రాజు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. విజయశ్రీ, ఉప మండల అభివృద్ధి అధికారి పద్మావతి, అంబేద్కర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు మందపాటి పరమానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనకు అంజినేష్ కృషి

బాపట్ల ఆగస్టు 13 వార్త సాక్ష్యం



బిడపీ'ఎస్ మానవ హక్కులు, అవినీతి నిరోధక సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా కారుమూరి అంజినేష్ నియమితులయ్యారు. జిల్లాలో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడంతో పాటు సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఆయనను ఈ పదవికి నియమించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.ప్రజల సమస్యలను తెలుసుకుని, మానవ హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక న్యాయం కోసం నిబద్ధతతో పనిచేస్తానని అంజినేష్ తెలిపారు. ప్రభుత్వ శాఖలు, ప్రజలు, సంస్థ మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా అంజినేష్‌ను పలువురు అభినందించారు.

# ఏపీపీఎస్సీలో అక్రమాలు సిట్ నివేదికతో బట్టబయలయ్యాయి

## జగన్ సమాధానం చెప్పాలి: మంత్రి డోలా



ఆగస్టు 13 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, పాపాలు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నివేదిక ద్వారా బట్టబయలయ్యాయని, వీటికి మాజీ ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి డిమాండ్ చేశారు. గురువారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిట్ నివేదికలో వెలుగు చూసిన వాస్తవాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని అన్నారు.సిట్ నివేదిక ప్రకారం, వాల్యుయేషన్ ప్రక్రియలో పాల్గొన్న 158 మంది వాల్యుయేటర్లలో కేవలం 72 మందికి మాత్రమే అర్హత ఉందని, మిగిలిన వారంతా అనర్హులేనని మంత్రి స్పష్టం చేశారు. అధికారిక వ్యవస్థను కాదని, ప్రైవేట్ జీమెయిల్ ఖాతాలు, వ్యక్తిగత ఐడీలు, డ్రైవ్‌ల ద్వారా వాల్యుయేషన్ నిర్వహించడం దారుణమని అన్నారు. అంతేకాకుండా, అభ్యర్థుల ఆన్సర్ షీట్లను ఓ ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించి, సీసీ కెమెరాలు గానీ, యూనివర్సిటీ నిపుణుల పర్యవేక్షణ గానీ లేకుండా 86 రోజుల పాటు అక్కడే ఉంచి మూల్యాంకనం జరిపారని ఆరోపించారు. ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 160 మంది (96.97 శాతం) ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయని, మొత్తం 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తే 97.55 శాతం షీట్లలో దిద్దుబాట్లు కనిపించాయని సిట్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో వైట్నర్ వాడకం, సంతకాలు సరిపోకపోవడం, ఒకే పేపర్‌లో రెండు రకాల ఇంక్ వాడటం, చీఫ్ ఎగ్జామినర్ సంతకాలలో తేడాలు వంటి అనేక అక్రమాలు తేలాయని వివరించారు. ఇవి కేవలం సాంకేతిక తప్పిదాలు కావని, మెరిట్ ఉన్న అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకున్న చెలగాటమని మంత్రి మండిపడ్డారు. ఈ అక్రమాలన్నింటికీ జగనే ప్రధాన బాధ్యుడని, యువతను, కోర్టులను తప్పుదారి పట్టించిన ఆయనకు రాజకీయాల్లో కొనసాగే నైతిక అర్హత లేదని డోలా అన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీలో భాగంగా, అత్యంత పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన 16 వేల డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. వైసీపీ నేతలు 240కి పైగా కేసులు వేసినా, చట్టబద్ధంగా అన్నింటినీ అధిగమించి డీఎస్సీని పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారు, ముందుగా సిట్ నివేదికలో తేలిన తమ అక్రమాలపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. తెలుగు దేశం ప్రభుత్వం యువతకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతుందని, గతంలో జరిగిన అక్రమాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పైలట్ కావాలనుకునే వారికి శుభవార్త- ఇక ఏపీలోనే శిక్షణ!



ఆగస్టు 13 వార్త సాక్ష్యం

ఏపీ ఏవియేషన్ రంగంలో ఒక కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పైలట్ శిక్షణ కోసం ఎదురుచూస్తున్న యువతకు శుభవార్త అందిస్తూ, ప్రభుత్వం కొత్తగా ఆరు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ల (ఎఫ్‌టీవో) ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ఇప్పటివరకు రాష్ట్రంలో అందుబాటులో లేని ఈ సౌకర్యం కర్నూలు, కడప, రాజమహేంద్రవరం విమానాశ్రయాల వేదికగా ప్రారంభం కానుంది. ఈ కేంద్రాల రాకతో ఏపీ ఏవియేషన్ శిక్షణలో ఒక ముఖ్య కేంద్రంగా మారే అవకాశం ఉంది. మొత్తం మూడు విమానాశ్రయాల్లో ఆరు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఏపీఏడీసీఎల్ (ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ) నిర్వహణలో ఉన్న కర్నూలు విమానాశ్రయంలో రెండు ఎఫ్‌టీవోలు రానున్నాయి. వీటిలో మొదటి కేంద్రాన్ని ఈ నెల 22న ప్రారంభించనుండగా, మరొకటి డిసెంబర్ నాటికి అందుబాటులోకి వస్తుంది. ఇక, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) పరిధిలోని రాజమహేంద్రవరం, కడప విమానాశ్రయాల్లో రెండేసి చొప్పున కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. రాజమహేంద్రవరంలో టెండర్ల ప్రక్రియ పూర్తికాగా, ఆరు నెలల్లో కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. కడపలో ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ మొదలైంది. తిరుపతి విమానాశ్రయంలో కూడా ఎఫ్‌టీవోల ఏర్పాటు ప్రతిపాదన పరిశీలనలో ఉంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి అనుమతి పొందిన ప్రైవేటు సంస్థలు ఈ శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తాయి. ఒక్కో కేంద్రం ద్వారా సుమారు 30 నుంచి 40 మందికి పైలట్ శిక్షణ ఇస్తారు. కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందడానికి అవసరమైన 180 గంటల విమాన శిక్షణను ఈ కేంద్రాల్లో పూర్తి చేయవచ్చు. ఇందుకోసం ఆయా సంస్థలు ఎయిం ̄పోర్ట్ రన్‌వేకు అనుసంధానంగా ప్రత్యేక హ్యాంగర్లు నిర్మించి, చిన్న విమానాల ద్వారా శిక్షణ అందిస్తాయి. వీటితో పాటు నాగార్జున సాగర్ వద్ద ఉన్న ఎయిం ̄స్ట్రిప్‌లో కూడా ఒక ఎఫ్‌టీవోను ఏర్పాటు చేసేందుకు ఏపీఏడీసీఎల్ ఇప్పటికే అనుమతులు పొందింది. భవిష్యత్తులో అక్కడ కొత్త విమానాశ్రయాన్ని నిర్మించాలనే ప్రభుత్వ ప్రణాళికకు అనుగుణంగా ప్రస్తుత ఎయిర్‌స్ట్రిప్‌ను ఏపీఏడీసీఎల్‌కు బదిలీ చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ పరిణామాలతో పైలట్ శిక్షణ కోసం యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది

# ఘనంగా తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల యువ సమ్మేళనం



కరీంనగర్ ఆగస్టు 13 వార్త సాక్ష్యం

ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్తపల్లిలోని సాయిరాం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన యువ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ప్రధాన వక్తలుగా హాజరైన ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భాను చందర్ జి, తడిగొప్పుల శంకరయ్య జి లు మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువతే బలమైన పునాదన్నారు. యువత క్రమశిక్షణ, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు యువతకు ఉందని, ఇటీవల జెన్–జీ చెపట్టిన ఆందోళనలు దేశ వ్యతిరేకం కాదని, ఆ ముసుగులో దేశ వ్యతిరేక శక్తులు చొరబడి అలజడులు సృష్టించి దేశాన్ని దెబ్బ తీసే ప్రయత్నం జరిగిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఆందోళనలు, నిరసనలు సంభాషణకు ఒక మార్గమని, అయితే అవి ప్రజాస్వామ్య నిబంధనల పరిధిలోనే జరగాలని కానీ, దేశ వ్యతిరేక శక్తులు ఇలాంటి విషయాల్లో తల దూర్చితే అనేక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, అందుకే యువత జాగ్రత్తతో వ్యవహరించాలని వక్తలు సూచించారు. ముఖ్యంగా దేశాభివృద్ధిలో, సామాజిక మార్పులో యువత క్రమశిక్షణ, దేశభక్తితో ముందుండి దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని వారు ఆకాంక్షించారు. యువత దేశం పట్ల అంకితభావం, మన సంస్కృతి, సంప్రదాయాలు,చారిత్రక గొప్పతనంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవలం విద్యనే కాకుండా క్రమశిక్షణ, సమయ పాలన, కష్టకాలంలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే నాయకత్వ గుణాలను పెంపొందించుకోవాలని సూచించారు. కుల, మత, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి సమాజమంతా ఒక్కటే అనే భావన ను యువత కలిగి ఉండాలన్నారు.యోగా, వ్యాయామాలు, బౌద్ధిక చర్చలు ను యువత నిత్యజీవితంలో అలవాటుగా మార్చుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ (మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ), రక్తదాన శిబిరాలు సామాజిక సేవా కార్యక్రమాలలో యువత క్రియాశీల కంగా ఉండాలన్నారు.. ప్రధానంగా ఈ సమ్మేళనాలు యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, దేశ నిర్మాణాత్మక కార్యక్రమాలలో భాగస్వా మ్యులుగా చేయాలనే సంకల్పంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్, సహకార్యవాహ మురళి, రమణ, కన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

# నల్లబెల్లం, పటిక స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



కామారెడ్డి ఆగస్టు 13 వార్త సాక్ష్యం

కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె. ముకుంద ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు సిరిసిల్ల రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇండికా కారును తనిఖీ చేశారు. కారులో 600 కిలోల నల్లబెల్లం, 10 కిలోల పటిక గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీర్నపల్లి గ్రామానికి చెందిన భూక్య గంగాను అరెస్ట్ చేసి, ఆ్రా 28 జఐ 3397 నంబర్ గల కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి సమాచారం మేరకు కామారెడ్డి గంజి మార్కెట్‌లోని కృష్ణకుమార్ ట్రేడింగ్‌ను తనిఖీ చేయగా అక్కడ కూడా నల్లబెల్లం, పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కృష్ణకుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో మొత్తంగా నల్లబెల్లం, పటికతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నాటుసారాయి తయారీకి ఉపయోగించే ముడి సరుకును నిల్వ చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారి కె. ముకుంద హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సంపత కృష్ణ, ఎస్ఐ విక్రమ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ జాన్, కానిస్టేబుళ్లు గోరి, పవన్ కుమార్, రాజు, బాబు, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగనివ్వం






-బాధితులకు అండగా ఉంటాం.. నెలకోసారి సివిల్ రైట్స్ డే
-సూర్యాపేట కలెక్టర్ పనితీరు భేష్
-ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

సూర్యాపేటఆగస్టు 13 వార్త సాక్ష్యం

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బాధితులకు అన్ని వేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు, సంక్షేమ పథకాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీల కోసం కేటాయిస్తున్న సబ్‌ప్లాన్ నిధులను పక్కాగా వినియోగించాలని, దారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిగిలిన నిధులతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఉద్యోగాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. ఎంపీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్‌డీఎఫ్ నిధులను నిబంధనల ప్రకారం కేటాయించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

-నెలకోసారిసివిల్ రైట్స్ డే

బాధితుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రతి నెల చివరి వారంలో 'సివిల్ రైట్స్ డే' నిర్వహించాలని ఎస్పీ నరసింహకు సూచించారు. ఈ కార్యక్రమానికి ఎస్సైలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. గ్రామస్థాయిలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

-బాధితులకు ఇళ్లు, ఉపాధి

ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు రావాల్సిన పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి అవకాశాలను త్వరితగతిన కల్పించాలని అధికారులను ఆదేశించారు. 'భూభారతి' ద్వారా భూ సమస్యల పరిష్కారానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని తెలిపారు.

-కలెక్టర్ పనితీరుపై ప్రశంసలు

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యక్రమాల అమలుపై కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఇచ్చిన ప్రజెంటేషన్ అద్భుతంగా ఉందని బక్కి వెంకటయ్య ప్రశంసించారు. ప్రతి అంశంపై పూర్తి సమాచారంతో ప్రణాళికలు సిద్ధం చేసి సమర్థవంతంగా పనిచేస్తున్నారని కొనియాడారు. కేసుల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పీ నరసింహ కూడా చురుగ్గా వ్యవహరిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, శంకర్, అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, ఎస్సీ డీడీ లత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి





- ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- కలెక్టర్ చిత్రా మిశ్రా.

కరీంనగర్ ఆగస్టు 13 వార్త సాక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు కలియ తిరుగుతూ రిజిస్టర్ పరిశీలించారు. పిల్లలు, సిబ్బంది వివరాలు, చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జిల్లాలోని16 భవిత కేంద్రాల్లో తాగునీరు (వాటర్ డిస్పెన్సరీలు) ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు.ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది(సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులు పరిశీలించి అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు.పాఠశాలలో వృధాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటంపై అసహన వ్యక్తం చేశారు. ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్ ను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృధాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

- అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన.

ఆ తర్వాత డాక్టర్ స్ట్రీట్ లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరినందున మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లోకి ఈ స్కూల్ ను తరలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి.. పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# యూరియా కోసం కొత్తపల్లిలో సొసైటీకి తాళం వేసిన రైతులు

గంభీరావుపేట ఆగస్టు 13 వార్త సాక్ష్యం

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో గురువారం రోజున యూరియా కోసం రైతులు మధ్యాహ్నం మూడు గంటలకు సొసైటీ వారు యూరియా బుక్ అవుతాదని చెప్పడంతో, రైతులు అందరు మూడు గంటలకు ఫోన్ పట్టుకొని కండల్లో వత్తులు వేసుకుని చూస్తున్నట్టు చూశారు కానీ బుక్ చేసేసరికి యూరియా బుక్ కాకపోవడంతో ఆగ్రహానికి గురై సొసైటీని ముట్టడించి సొసైటీకి తాళం వేశారు పంట పొలాలకు సరిపడ యూరియా దొరకపోవడంతో రైతులు ఆగ్రాహించినారు. టెక్నాలజీ రైతులకు పనులు సులువు చేయకపోగా ఇబ్బందులను మరింత పెంచుతోంది. దీనికి తాజా ఉదాహరణ 'ఫర్టిలైజర్ బుకింగ్' యాప్. ఈ యాప్ ద్వారానే యూరియా బుక్ చేసుకోవాలనే నిబంధన రైతులకు సంకటంగా మారింది. రిటైల్ డీలర్లు యూరియాను విక్రయించకపోవడం, సహకార సంఘాల్లో తగినన్ని నిల్వలు లేకపోవడంతో.. యాప్ బుకింగ్‌పై రైతుల్లో వ్యతిరేకత వస్తోంది. యాప్ అమలులో క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో మండలం యూనిట్‌గా యూరియా కేటాయింపులు ఉంటున్నాయి. బుకింగ్ సమయంలో ఆ మండలంలో ఏ డీలర్ వద్ద యూరియా ఉంటే అక్కడే రైతుకు 2 బస్తాల యూరియాను కేటాయిస్తున్నారు. ఒక ఎకరం ఉన్న రైతులకు ఒకేసారి, ఎకరం నుంచి ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు విడతల వారీగా ఎకరాకు రెండు బస్తాల చొప్పున యూరియాను అందిస్తున్నారు. యాప్‌లో బుకింగ్ ద్వారా ఒక పర్యాయం గరిష్ఠంగా రెండు బస్తాలు మాత్రమే కేటాయిస్తున్నారు. దీంతో ఐదు నుంచి పది ఎకరాల వరకు సాగు చేసే రైతులు అయిదు నుంచి పదిసార్లు బుక్ చేయాల్సి వస్తోంది. ఇన్నిసార్లు బుకింగ్ చేయటం, యూరియా కోసం పలుమార్లు వెళ్లాల్సి రావటంతో వ్యవసాయ పనులు మానుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు బస్తాల సీలింగ్ ప్రకారమే రైతులకు వచ్చే కోటా యూరియాను సీజన్ మొత్తానికి ఒకేసారి బుకింగ్ చేసుకునేలా అవకాశం కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# ఐక్యతతో గ్రామాభివృద్ధి



పిట్టలవానిపాలెం ఆగస్టు 13 వార్త సాక్ష్యం

గ్రామ ప్రజలు ఐక్యతతో మెలగాలని పిట్టలవానిపాలెం ఎస్ఐ కె. మాధవరావు సూచించారు. పిట్టువారిపాలెం గ్రామ ప్రజలతో ఆయన ముచ్చటించి గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలోని యువత మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు యువత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి యువకుడు తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామంలో అక్షరాస్యత శాతం పెరిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఎస్ఐ మాధవరావు పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పర సహకారంతో ఐక్యతగా ఉంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

## మహిళా అభ్యున్నతికి వరలక్ష్మమ్మ చిరస్మరణీయ సేవలు



బాపట్ల ఆగస్టు 13 వార్త సాక్ష్యం

మహిళల్లో చైతన్యాన్ని రగిలించి, వారిని స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములను చేసిన మహనీయురాలు కనుపర్తి వరలక్ష్మమ్మ అని వక్తలు కొనియాడారు. కనుపర్తి వరలక్ష్మమ్మ 48వ వర్ధంతి సందర్భంగా గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో శీలంవారిపాలెంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కనుపర్తి వరలక్ష్మమ్మ గాంధీజీ శిష్యురాలిగా జీవితాంతం నేత చీరలనే ధరించారని, మహిళలతో రాట్నలక్ష్మీ వ్రతాలు చేయించి నూలు వడికించారని తెలిపారు. స్త్రీలందరూ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిస్తూ 'ఓటు పురాణం' రచించారని గుర్తుచేశారు. స్త్రీ హితైషిణీ మండలిని స్థాపించి మహిళల కోసం విద్యాలయం, గ్రంథాలయాన్ని నిర్వహించారని పేర్కొన్నారు. జీవితాంతం మహిళల అభ్యున్నతికి కృషి చేసిన వరలక్ష్మమ్మ సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. నాగమణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. అనిల్‌కుమార్, అధ్యాపకులు పద్మజ, స్వాతి, కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాటతో ఒక పూట పోస్టర్ ఆవిష్కరణ



మిర్యాలగూడఆగస్టు 13 వార్త సాక్ష్యం

మిర్యాలగూడ పట్టణంలో 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కవులు, కళాకారులను, విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన పాటతో ఒక పూట కార్యక్రమం పోస్టర్ ను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, శాసనమండలి కార్యాలయంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులను కళాపోషకులను ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన పాటతో ఒక పూట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మిర్యాలగూడ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కళాకారులు కళాపోషకులు విద్యార్థులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మారం శ్రీనివాస్, ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాదుగుల శ్రీనివాస్, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్, కళాకారుడు నకరేకంటి కిరణ్ కుమార్, నకిరేకంటి వేణు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## బీఎస్ఎన్ఎల్ బంపరాఫర్.. కేవలం రూపాయికే సిమ్, ఉచిత కాల్స్!

-స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ప్రత్యేక ఆఫర్లు
-కొత్త కస్టమర్ల కోసం రూ. 1 ఫ్రీడమ్ ప్లాన్ పునఃప్రారంభం
-24 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 1జీబీ డేటా, అపరిమిత కాల్స్
-రూ. 2,399 వార్షిక ప్లాన్‌పై 47 రోజుల అదనపు వ్యాలిడిటీ
-సెప్టెంబర్ 12 వరకు మాత్రమే అందుబాటులో ఆఫర్లు

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. కొత్త కస్టమర్ల కోసం కేవలం ఒక్క రూపాయికే 'ఫ్రీడమ్ ప్లాన్'ను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ప్లాన్ కింద ఉచిత సిమ్ కార్డుతో పాటు, 24 రోజుల వ్యాలిడిటీతో అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 1 జీబీ హై-స్పీడ్ డేటా లభిస్తాయి. ఈ ఆఫర్ కేవలం కొత్తగా బీఎస్ఎన్ఎల్ కనెక్షన్ తీసుకునే వారికి మాత్రమే వర్తిస్తుంది. ప్రస్తుత వినియోగదారులకు ఈ సౌకర్యం అందుబాటులో ఉండదు. ఈ పరిమిత కాల ఆఫర్ 2026 సెప్టెంబర్ 12 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఆసక్తి గలవారు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా అధీకృత రిటైలర్లను సంప్రదించి, కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా కనెక్షన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. గతేడాది కూడా బీఎస్ఎన్ఎల్ 'ఆజాదీ కా ప్లాన్' పేరుతో ఇటువంటి ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. అప్పట్లో 30 రోజుల వ్యాలిడిటీతో పాటు రోజుకు 2 జీబీ డేటాను అందించింది. అయితే, ఈసారి 'ఫ్రీడమ్ 2.0' వెర్షన్‌లో వ్యాలిడిటీతో పాటు రోజువారీ డేటా పరిమితిని కూడా తగ్గించింది. ఇదే స్వాతంత్ర్య దినోత్సవ ఆఫర్‌లో భాగంగా, బీఎస్ఎన్ఎల్ తన రూ. 2,399 వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌ను కూడా అప్‌గ్రేడ్ చేసింది. ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 12 మధ్య ఈ ప్లాన్‌తో రీఛార్జ్ చేసుకునే వారికి 47 రోజుల అదనపు వ్యాలిడిటీ లభిస్తుంది. దీంతో మొత్తం వ్యాలిడిటీ 412 (365౦47) రోజులకు పెరుగుతుంది. ఈ ప్లాన్‌లో అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 2 జీబీ డేటా ప్రయోజనాలు యథాతథంగా కొనసాగుతాయి. తమ 4జీ నెట్‌వర్క్‌లోకి కొత్త వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఆఫర్లను ప్రకటించినట్లు బీఎస్ఎన్ఎల్ వెల్లడించింది.

## ఈసారి ఆసియా క్రీడల్లో భారత్-పాక్ మ్యాచ్ జరగాలంటే.. ఇదే ఏకైక మార్గం!

జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడలు 2026లో భారత క్రికెట్ జట్లు
పురుషుల, మహిళల విభాగాల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి టీమిండియా
ఫైనల్ లేదా కాంస్య పతక పోరులోనే భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు అవకాశం
పురుషుల జట్టుకు శ్రేయాస్ అయ్యర్, మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం




జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు 2026లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఈ మెగా ఈవెంట్ జరగనుంది. గతంలో హాంగ్జౌలో జరిగిన క్రీడల్లో రెండు విభాగాల్లోనూ స్వర్ణ పతకాలు గెలుచుకున్న భారత జట్లు, ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. ఈ టోర్నీలో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగాలంటే కేవలం రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. ఈ చిరకాల ప్రత్యర్థులు స్వర్ణ పతకం కోసం ఫైనల్లో తలపడాలి లేదా కాంస్య పతకం కోసం జరిగే ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో అయినా పోటీపడాలి. అంటే.. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ జరగాలంటే ఇరు జట్లు సెమీఫైనల్స్ గెలిచి ఫైనల్ చేరడమో లేదా సెమీస్‌లో ఓడిపోవడమో జరగాలి. అన్ని మ్యాచ్‌లు పూర్తి అంతర్జాతీయ హోదాతో టీ20 ఫార్మాట్‌లో జరగనున్నాయి. పురుషుల విభాగంలో టాప్ సీడ్ జట్లుగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. మిగిలిన నాలుగు స్థానాల కోసం ఇతర జట్లు గ్రూప్ దశలో పోటీపడతాయి. భారత పురుషుల జట్టుకు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా, యువ ఆటగాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కింది. మహిళల విభాగంలో సెప్టెంబర్ 17 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. క్వార్టర్ ఫైనల్‌లో భారత జట్టు జపాన్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే బంగ్లాదేశ్ లేదా చైనా జట్టుతో సెమీఫైనల్‌లో ఆడుతుంది. మరో క్వార్టర్‌లో పాకిస్థాన్ జట్టు థాయ్‌లాండ్‌తో తలపడనుంది. మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నారు. మొత్తం మీద రెండు విభాగాల్లోనూ పటిష్ఠమైన జట్లతో బరిలోకి దిగుతున్న భారత్, మరోసారి పసిడి పతకాలే లక్ష్యంగా ప్రయాణం మొదలుపెట్టనుంది.

# క్రీడలు

## టెస్టుల్లో మిచెల్ స్టార్క్ ప్రపంచ రికార్డు.. అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా చరిత్ర

అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా హెరాత్‌ను అధిగమించిన ఆసీస్ పేసర్ 434 వికెట్లతో భారత దిగ్గజం కపిల్ దేవ్ రికార్డును సమం చేసిన స్టార్క్ స్టార్క్ రికార్డు రోజే బ్యాటింగ్‌లో విఫలమైన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే ఆలౌట్ ఆస్ట్రేలియా వెటరన్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఎడమచేతి వాటం బౌలర్‌గా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో శ్రీలంక దిగ్గజ స్పిన్నర్ రంగనా హెరాత్ (433) రికార్డును అధిగమించాడు. బంగ్లాదేశ్‌తో డార్విన్‌లోని మరారా క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లామ్‌ను ఔట్ చేయడం ద్వారా స్టార్క్ తన టెస్టు వికెట్ల సంఖ్యను 434కి పెంచుకున్నాడు. తన 106వ టెస్టులో ఈ మైలురాయిని చేరుకున్న స్టార్క్, భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ (434 వికెట్లు) రికార్డును సమం చేశాడు. ప్రస్తుతం టెస్టుల్లో ఆల్-టైమ్ వికెట్ టేకర్ల జాబితాలో 10వ స్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా పేస్ దిగ్గజం డేల్ స్టెయిన్ (439) రికార్డును బద్దలు కొట్టడానికి స్టార్క్ కేవలం ఆరు వికెట్ల దూరంలో ఉన్నాడు. ఈ రికార్డుతో ఎడమచేతి వాటం బౌలర్ల జాబితాలో స్టార్క్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. రంగనా హెరాత్ (433), పాకిస్థాన్ గ్రేట్ వసీం అక్రమ్ (414), న్యూజిలాండ్ స్పిన్నర్ డానియల్ వెటోరి (362), శ్రీలంక పేసర్ చమిందా వాస్ (355) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 348 వికెట్లతో ఈ జాబితాలో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే, వ్యక్తిగత రికార్డులపై తాను పెద్దగా దృష్టి పెట్టనని, జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఈ సిరీస్‌కు ముందు స్టార్క్ పేర్కొన్నాడు. ఐసీసీ కథనం ప్రకారం.. "ఇలాంటి దిగ్గజాల సరసన నా పేరు వినిపించడం గౌరవంగా ఉంది. కానీ, ఆడుతున్నప్పుడు ఈ గణాంకాలకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు" అని స్టార్క్ తెలిపాడు. కాగా, స్టార్క్ ఈ చారిత్రక ఘనత సాధించిన రోజే ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్, బంగ్లాదేశ్ బౌలర్ల ధాటికి కేవలం 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి 6 వికెట్లతో కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేశాడు. ఆసీస్ తరఫున స్టీవ్ స్మిత్ (71) ఒక్కడే పోరాడాడు.



## లంకలో టీమిండియా పేసర్లకు కఠిన పరీక్ష.. రాణించాలంటే ఇవి తప్పవన్న మోర్కెల్

-శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు భారత పేసర్లకు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సూచనలు
-వేడి, ఉక్కపోతకు త్వరగా అలవాటుపడాలని హితవు
-కూకబుర్రా బంతి త్వరగా మెత్తబడుతుందని, అందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిక
-గాయంతో బుమ్రా దూరం కావడంతో సిరాజ్‌పై పెరిగిన భారం
-బంతి పాతబడ్డాక స్మార్ట్‌గా బౌలింగ్ చేసి ఒత్తిడి పెంచాలని పిలుపు
-ఆగస్టు 15 నుంచి తొలి టెస్టు



శ్రీలంక పర్యటనలో భారత ఫాస్ట్ బౌలర్లకు కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయని, వాటిని అధిగమించాలంటే త్వరగా పరిస్థితులకు అలవాటుపడాలని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సూచించారు. లంకలోని తీవ్రమైన వేడి, ఉక్కపోతతో పాటు కుకబుర్రా బంతి స్వరూపం మారడాన్ని అర్థం చేసుకుని, ఒత్తిడిని సృష్టించేందుకు సృజనాత్మకంగా ఆలోచించడం చాలా కీలకమని ఆయన స్పష్టం చేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత పేసర్లు తీవ్రతను కొనసాగించడం అత్యవసరమని మోర్కెల్ పేర్కొన్నారు. కీలక పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మోకాలి గాయంతో ఈ సిరీస్‌కు దూరం కావడంతో భారత పేస్ దళానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ప్రస్తుతం జట్టులో మహమ్మద్ సిరాజ్ అత్యంత అనుభవజ్ఞుడైన పేసర్‌గా మారాడు. ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, కొత్తగా జట్టులోకి వచ్చిన అకిబ్ నబీలతో భారత పేస్ దళం బరిలోకి దిగనుంది. శ్రీలంక పరిస్థితులపై మోర్కెల్ మాట్లాడుతూ, "ఇక్కడికి రావడంలో అతిపెద్ద సవాలు వేడి, ఉక్కపోత. అలాగే, కుకబుర్రా బంతి 25-30 ఓవర్ల తర్వాత మెత్తబడిపోతుంది. ఈ వాస్తవాన్ని మనం అంగీకరించాలి. ఇలాంటి పరిస్థితుల్లో అంతా మన మైండ్‌సెట్‌పై ఆధారపడి ఉంటుంది. ఫాస్ట్ బౌలర్‌గా చిన్న స్పెల్స్ వేసినా, బంతిపై పూర్తి శక్తిని ప్రయోగించి సరైన ప్రాంతాల్లో సంధిస్తే అవకాశాలు వాటంతట అవే వస్తాయి" అని వివరించారు. బంతి కొత్తగా ఉన్నప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆ తర్వాత అవకాశాలు సృష్టించు కోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాలని మోర్కెల్ సూచించారు. "టెస్ట్ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌పై బౌన్స్ హెచ్చుతగ్గులుగా మారే అవకాశం ఉంది. మేం గత కొన్ని నెలలుగా రెడ్-బాల్ క్రికెట్ ఎక్కువగా ఆడలేదు. కాబట్టి తిరిగి ఆ ఫార్మాట్‌లోకి రావడం కూడా ఒక సవాలే. నిలకడగా ఓవర్లు వేస్తూ తీవ్రతను కొనసాగిస్తే బ్యాటర్లపై ఒత్తిడి పెంచవచ్చు," అని ఆయన అన్నారు. బంతి పాతబడిన తర్వాత క్రీజును ఉపయోగించుకోవడం, షార్ట్ బంతులను వ్యూహాత్మకంగా ప్రయోగించడం వంటి విషయాల్లో "స్ట్రీట్ స్మార్ట్"గా ఆలోచించాలని మోర్కెల్ తన బౌలర్లకు పిలుపునిచ్చారు. ఆగస్టు 15 నుంచి గాలేలో తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు జరగనున్నాయి.

# ‘ఎమ్ఆర్ పీ’(అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!



నరేశ్ అగస్త్య వరుసగా సినిమాలు చేస్తూ వెళుతున్నాడు. క్రైమ్ కామెడీ నేపథ్యంలో ఆయన చేసిన సినిమాలు ఓటీటీ ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్నాయి. అలాంటి నరేశ్ అగస్త్య నుంచి వచ్చిన మరో సినిమానే ‘ఎమ్ఆర్ పీ’. ‘నీకెంత నాకెంత’ అనేది క్యాప్షన్. డార్క్ క్రైమ్ కామెడీ జోనర్లో నిర్మితమైన ఈ సినిమాకి శ్రవణ్ జేష్ఠ దర్శకత్వం వహించాడు. జులై 17వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, నెల తిరక్కముందే ఓటీటీకి వచ్చేసింది. మనోహర్ (నరేశ్ అగస్త్య) పరమేశ్వర్ ( సుదర్శన్) రవి ( కసిరెడ్డి రాజ్ కుమార్) ముగ్గురూ మంచి స్నేహితులు. హైదరాబాద్ లో ఒకే రూమ్ లో కలిసి ఉంటూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. మనోహర్ ను అదే ఆఫీసులో పనిచేసే అమృత ప్రేమిస్తూ ఉంటుంది. ఇంట్లో వాళ్లు తనకి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తొందర చేస్తూ ఉంటుంది. చాలా తక్కువ జీతాన్ని సంపాదిస్తున్న మనోహర్, బిజినెస్ చేసి తన స్థాయిని మార్చుకోవాలనుకుంటాడు. అందుకు పెద్దమొత్తంలో డబ్బు అవసరమవుతుంది. ముగ్గురు స్నేహితులు తమ సొంత ఊరుకి వెళ్లి, డబ్బు కోసం ప్రయత్నిస్తారు. కానీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది. అదే సమయంలో కామేశ్వర రావు హత్య జరుగుతుంది. కామేశ్వరరావుకి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు ‘దైవాజీ’ (నంద గోపాల్) పెద్ద రౌడీ. వడ్డీలకు డబ్బులు తిప్పుతూ, వడ్డీ ఇవ్వనివారిని హింసిస్తూ ఉంటాడు. తన తల్లి చనిపోతే తండ్రి మళ్లీ పెళ్లి చేసుకున్నాడనే ఒక కోపం అతనికి ఉంటుంది. చిన్న కొడుకు ‘భాను’ మాత్రం తండ్రిని జాగ్రత్తగా చూసుకుంటూ ఉంటాడు. పెద్ద కొడుకు కారణంగా చనిపోయిన కామేశ్వర రావు బాడీ హాస్పిటల్లో ఉంటుంది.‘దైవాజీ’ దగ్గర మనోహర్ మిత్ర బృందం అప్పు తీసుకుంటుంది. అయితే గడువులోగా వడ్డీ చెల్లించలేక పోతారు. దాంతో మొత్తం బాకీ తీర్చమని అతను రెండు రోజులు గడువు పెడతాడు. దాంతో వాళ్లు కామేశ్వరరావు బాడీని హాస్పిటల్ నుంచి తరలించి, భానుని డబ్బు కోసం డిమాండ్ చేస్తారు. ఆ తరువాత చూస్తే కామేశ్వర రావు బాడీ స్థానంలో ఒక లేడీ శవం ఉంటుంది. కామేశ్వరరావు బాడీ ఏమైందనేది తెలియదు. లేడీ బాడీ ఎవరిదనేది అంతుబట్టదు .. ఆమె ఎలా చనిపోయిందనేది అర్థం కాదు. అప్పుడ్డు వాళ్లు ఏం చేస్తారు. ఎలాంటి పరిణామాలు ఎదుర్కుంటారు? అనేది మిగతా కథ. ముగ్గురు స్నేహితులు చాలీ చాలని జీతాలతో సంతోషంగా బ్రతకలేమని భావించి, ఒక రౌడీ షీటర్ దగ్గర అప్పు చేస్తారు. ఆ అప్పు తీర్చడం కోసం అతని తండ్రి డెడ్ బాడీని రహస్యంగా తరలిస్తారు. ఆ రౌడీ షీటర్ తమ్ముడికి కాల్ చేసి పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తారు. అయితే అతను ఆ డబ్బు తెచ్చేలోగా, తాము తీసుకొచ్చింది ఒక లేడీ డెడ్ బాడీని అని తెలిసి మిత్ర బృందం ఉలిక్కి పడుతుంది. ఈ రెండు డెడ్ బాడీల చుట్టూనే రాసుకున్న కథ ఇది. స్నేహితులు ముగ్గురు సిటీలో సరదాగా తిరగడం .. ప్రేమలో పడటం .. డబ్బు కోసం అవస్థలు పడటం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. ఇక పొరపాటున తాము తెచ్చేసిన లేడీ డెడ్ బాడీ ఎవరిదనేది తెలుసుకోవడానికి మిత్రబృందం చేసే ప్రయత్నాలతో .. తండ్రి డెడ్ బాడీ కోసం కొడుకులిద్దరూ వేరు వేరు ఉద్దేశాలతో వెతకడంతో సెకండాఫ్ కొనసాగుతుంది. సుదర్శన్ .. కసిరెడ్డి కామెడీ సరిపోదన్నట్టుగా, ఈ మధ్యలోనే ‘మేగ్నట్ మణి’ పాత్రలో వెన్నెల కిశోర్ ఎంట్రీ ఇస్తాడు. స్నేహితులు ఏదో ఒక ప్రమాదంలో చిక్కుకోవడం .. ఆ గండం నుంచి బయటపడటానికి నానా అవస్థలు పడటం వంటి కథలతో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. ఈ సినిమా కూడా అదే తరహాలో సాగుతుంది. లవ్ .. రొమాన్స్ .. ఎమోషన్స్ కి అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. కామెడీకి .. క్రైమ్ కి ప్రాముఖ్యతనిస్తూ వెళ్లారు. అయితే ఆశించిన స్థాయిలో కామెడీ పండలేదు. క్రైమ్ వైపు నుంచి ఆకట్టుకున్నది కూడా చాలా తక్కువ. కథాకథనాలలో ఎక్కడా గాఢత కనిపించదు. తేలికైన సన్నివేశాలతో అలా అలా తేలిపోతూ ఉంటుంది. విలనిజం ఒక స్టేజ్ డ్రామాను తలపిస్తూ ఉంటుంది. విలన్ కి తండ్రిపై కోపానికి గల కారణం కూడా చాలా సిల్లీగా అనిపిస్తుంది. హీరో – హీరోయిన్ మధ్య సాగే ‘ఒక్కమాటే’ అనే సాంగ్ మాత్రం ఫరవాలేదు అనిపిస్తుంది. సింపుల్ లైన్ తో నడిచే రొటీన్ డ్రామాగా ఈ సినిమా మిగిలిపోతుందని చెప్పచ్చు. కామెడీని పండించే నటులనే తీసుకున్నారు గానీ, సరైన కామెడీ సీన్స్ రాసుకోలేకపోవడమే ప్రధానమైన లోపంగా కనిపిస్తుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం అంతగొప్పగా ఏమీ అనిపించవు.

## పెంపుడు జంతువుల యజమానుల పై రష్మీ గౌతమ్ కీలక వ్యాఖ్యలు



ప్రముఖ నటి, యాంకర్ రష్మీ గౌతమ్ పెంపుడు జంతువుల పెంపకందారుల బాధ్యతపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పంజాబ్‌లో చోటుచే సుకున్న ‘పిట్ బుల్’ దాడి ఘటన నేపథ్యంలో, తనను విమర్శించడం మాని అసలు సమస్యపై దృష్టి సారించాలని ఆమె హితవు పలికారు. ఈ మేరకు గురువారం ‘ఎక్స్’ వేదికగా ఆమె ఒక సుదీర్ఘ పోస్ట్‌ను పంచుకున్నారు. “ఒక నిర్దిష్ట జాతి శునకాన్ని కొనుగోలు చేయడం సులభమే కానీ, ఆ తర్వాత వచ్చే బాధ్యతలను స్వీకరించడానికి చాలా మంది సిద్ధంగా ఉండరు. ముఖ్యంగా కొన్ని రకాల జాతులకు తగిన వ్యాయామం, శిక్షణ ఎంతో అవసరం” అని రష్మీ పేర్కొన్నారు. సరైన శిక్షణ, వ్యాయామం కల్పించకుండా జంతువులను ఎక్కువ సమయం ఇంట్లోనే పరిమితం చేయడం వల్ల వాటిలో దూకుడు స్వభావం పెరిగే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. పలు విదేశీ జాతుల శు నకాలు భారత వాతావరణానికి, ఇక్కడి జీవన శైలికి ఏమాత్రం సరిపోవని ఆమె అభిప్రాయ పడ్డారు. ఈ సమస్యకు పరిష్కారంగా దేశంలో విదేశీ జాతి శునకాల బ్రీడింగ్‌తో పాటు వాటి విక్ర´యాల ను పూర్తిగా నిలిపివేయాలని ఆమె సూచించారు. పెంపుడు జంతువుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే యజమానులను కఠినంగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు. జంతువుల విక్ర యాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, మైక్రోచి ప్పింగ్, పెట్ ఇన్సూరెన్స్ వంటి నిబంధనలను తప్పనిసరి చేయాలని,మూగ జీవాలను వదిలేసినా, హింసించి నా భారీ జరిమా నాలు విధించాలని రష్మీ కోరారు. “నాపై ద్వేషం పెంచు కోవడం ఆపివేసి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడటాని కి తగిన సూచనలు చేయండి” అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పంజాబ్ లోని పాటియా లాలో ఓ ఇంటిని అద్దెకు చూసేందుకు వెళ్లిన దంపతులపై పిట్ బుల్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాం శమైన సంగతి తెలిసిందే.

## రానా, వెంకటేశ్‌లకు హైకోర్టులో ఎదురుదెబ్బ కేసు కొట్టివేత పిటిషన్ తిరస్కరణ





తమపై నమోదైన చోరీ, అతిక్రమణ కేసులను కొట్టివేయాలంటూ ప్రముఖ నటులు వెంకటేశ్, రానా దగ్గుబాటి, దగ్గుబాటి అభిరామ్‌తో పాటు నిర్మాత డి. సురేశ్ బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు తిరస్కరించింది. ఆస్తికి సంబం ధించిన సివిల్ వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందన్న కారణంతో క్రిమినల్ కేసు విచారణను నిలిపివేయ లేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఫిలింనగర్‌లోని డెక్కన్ కిచెన్ రెస్టారెంట్ ఆస్తికి సంబంధించి వ్యాపారవేత్త కోరె నందు కుమార్ ఈ కేసు నమోదు చేశారు. తాను లీజుకు తీసుకున్న స్థలంలో ఉన్న నిర్మాణాలను నిందితులు అక్రమంగా కూల్చి వేశారని, ప్రాంగణంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించి విలువైన సామగ్రిని తరలించారని ఆయన ఆరోపించారు. కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేశారని, తనను తన కుటుంబాన్ని బెదిరించారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇది పూర్తిగా సివిల్ తగాదా అని, దీనిపై క్రిమినల్ విచారణ కొనసాగించడం సరికాదని దగ్గుబాటి కుటుంబ సభ్యులు, వారి అకౌంటెంట్ గడ్డం విశ్వనాథం తరఫు న్యాయ వాదులు వాదించారు.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.